క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ హరికృష్ణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండలంలోని నందిగామ, భూనీడు గ్రామాల్లో బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను ఏఈ శాంతకుమార్ పంచాయతీ కార్యదర్శి శశికుమార్‌తో కలిసి ఆయన పరిశీలించి ఫొటోలు తీశారు. గ్రామానికి 11 ఇళ్లు మంజూరు కాగా 7 మాత్రమే బేస్ మెంట్ నిర్మాణం పూర్తి చేసుకోవడంతో మిగిలిన ఇళ్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లు మంజూరు అవుతుందన్నారు.

విద్యుత్ సిబ్బందిపై దాడి

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది సాయికిరణ్‌పై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా ఆలస్యం అయిందని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దాడి చేశాడు. దీంతో సిబ్బంది సదరు వ్యక్తిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఏఈ ప్రదీప్ కుమార్‌ను వివరణ కోరగా విద్యుత్ సరఫరా ఆలస్యం కావడంతో సిబ్బందితో గొడవ పెట్టుకొని దాడి చేశాడని దీనిపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వీరుమల్లేష్ అన్నారు. బుధవారం పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా 5వ తరగతి విద్యార్థులతో విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువు దగ్గర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్‌ను నిషేధించి ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు.

నిత్యావసర సరుకులు అందజేత



మరికల్: మండలంలోని గాజులయ్య తండాలో గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, వరదాసులు తండాలోని 35 మంది నిరుపేదలకు ఉచితంగా నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని అందజేసి మానవత్వం చాటుకున్నారు.

రైతులు ఉత్పత్తిసంఘంలో సభ్యులుగా చేరాలి



మరికల్: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తి సంఘంలో సభ్యులుగా చేరాలని విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. మరికల్ పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం ధన్వాడ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి సహకార సంఘ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఒకసారి రూ.2 వేలు చెల్లించి సంఘంలో చేరితే సంక్షేమ పథకాలతో నేరుగా లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, తదితర రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ గ్రామంలో స్వతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పీవైఎల్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆజాద్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, సిద్దు, గోవర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, మల్లేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బస్సు రాదు.. బాధ తీరదు..!



కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు (ఫైల్)

- గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామాలకు పల్లె వెలుగులు రాకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇతర చోట్లకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి రోజు పనుల నిమిత్తం రైతులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులు సమీప గ్రామాలకు వెళ్లి వస్తుంటారు. అయితే మారుమూల గ్రామాలకు బస్సులు తిరగకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. దీంతో చేసేది లేక ఆటో, జీపు తదితర ప్రైవేటు వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బస్సు సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. జిల్లాలో ఐదు బస్ స్టేషన్ల పరిధిలో 255 గ్రామాలు ఉండగా 54 గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదని అధికారిక లెక్కలు చెప్తున్నాయి.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నప్పటికీ షేర్నపల్లి, పేరపల్ల మీది తండా, లింగంపల్లి, వందరుగుట్ట, బోయిన్ పల్లి తండా, పిల్లిగుండ్ల తండా, తిరుమల దేవుని పల్లి ప్రాంతాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సు రానేలేదు. దీనికి తోడు చాలా గిరిజన తండాలకు పల్లె వెలుగు బస్సులు నడపడం లేదు. దీంతో స్థానిక ప్రజలు నిత్యం ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

అటు వేడుకలు.. ఇటు బాధలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. అయితే ఆధార్ కార్డ్ చూపించి జీరో టికెట్ ద్వారా ప్రయాణం చేయవచ్చు. ఇలా రాష్ట్రంలో ఇప్పటి వరకు 2 కోట్ల మంది ప్రయాణం చేశారని ఒక పక్క సంబరాలు చేస్తున్నారు. అయితే బస్సులు రాని గ్రామాల ప్రజలు మాత్రం బాధలు పడుతున్నారు. మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. రోడ్డు బాగున్న ఆర్టీసీ అధికారులు బస్సులు నడపడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

కాలి నడకే శరణ్యం



మా గ్రామానికి ఇప్పటివరకు ఆర్టీసీ బస్సు రాలేదు. నా చిన్నతనం నుంచి ఆటోలోనే వెళ్లి ఆటోలోనే వస్తున్నాను. కళాశాలకు వెళ్లడానికి విద్యార్థులంతా జాజాపూర్ వరకు నడిచి పోతుంటారు. గతంలో ఒకసారి సర్వే పేరుతో బస్సు గ్రామానికి వచ్చింది. సర్వే చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బస్సు సర్వీసును నడపడం లేదు.

–నవనీత, విద్యార్థిని, షేర్నపల్లి

ఆటోలోనే ప్రయాణం..



విద్యాసంస్థలు తెరుచుకుంటే పిల్లల కోసం ఆర్టీసీ బస్సు గ్రామానికి వస్తుంది. ఇక మిగతా సమయంలో అందరూ ఆటోలో ప్రయాణం చేయాల్సిందే. గతంలో పాలమూరు బస్సు వచ్చేది. చాలా ఏళ్లుగా అది కూడా ఆపేశారు. కూలీ పనులు, వ్యాపార నిమిత్తం ఇతర చోట్లకు వెళ్ళాలంటే సొంత వాహనంపై వెళ్తున్నాం. మహిళలు ప్రైవేట్ వాహనాల్లో కిక్కిరిసి ప్రమాదకరంగా వెళ్లాల్సి వస్తుంది.

– రాజు, ప్రైవేట్ ఉద్యోగి, తిరుమలాపూర్

చర్యలు తీసుకుంటాం



ఇప్పటికీ చాలా గ్రామాల నుంచి బస్సు కావాలని వినతులు వచ్చాయి. అన్ని పల్లెలకు బస్సులు నడపడానికి సరిపడా బస్సులు లేవు. కొత్త బస్సులు వచ్చిన వెంటనే ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తాం. భవిష్యత్‌లో అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటాం.

–లావణ్య, ఆర్టీసీ డిపో మేనేజర్, నారాయణపేట

మహాలక్ష్మితో మహిళలకు ఆర్థిక తోడ్పాటు

నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థికంగా తోడ్పాటును అందించి భరోసాను నింపిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో నిర్వహించిన మహాలక్ష్మి పథకం సంబరాల కార్యక్రమానికి ఇరువురు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు జరుగుతున్న మహాలక్ష్మి పథకాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయన్నారు. నారాయణపేట డిపో నుంచి ఇప్పటి వరకు 1.43 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించడం ద్వారా రూ.70.87 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. అనంతరం ఆర్టీసీ అధికారులు బస్సుల్లో ఎక్కువసార్లు ప్రయాణించిన పలువురు మహిళలను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కోస్గి రూరల్: ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని జిల్లా డిపో మేనేజర్ లావణ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని బస్టాండ్‌లో పలువురు మహిళలను సన్మానించి మెమోంటో అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించడంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణంతో పాటు స్వయం ఉపాధికి రుణాలను సైతం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోస్గి డిపో ఇంచార్జి బాలయ్య , మండల అధ్యక్షుడు రఘువర్దన్‌రెడ్డి , మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు తదితరులు ఉన్నారు.



మహిళకు మెమోంటో అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని అలాగే 5571 పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని, కొత్తగా ఏర్పడిన జిల్లాలకు డీఈవో పోస్టులను మంజూరు చేయాలన్నారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు వెంటనే సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు రాజేష్‌కుమార్, శంకర్, స్పందన, బాబురెడ్డి, రామకృష్ణ, ప్రాణేశాచారి, శ్రీనివాసులు, వెంకటరాములు, దుబ్బన్న, కళావతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించాలి

మక్తల్: మండలంలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టి 317 జీవో సమస్య, పెండింగ్ డీఏ, పీఆర్సీ విషయం, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ గురించి, బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపు గురించి, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 40 మంది విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలకు, ప్రతి తరగతికి ఒక టీచర్‌ను ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

మరికల్: ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. గత దశాబ్దాల నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఘనత తమ ఉపాధ్యాయ సంఘానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నవీన్, ముస్తఫా పాల్గొన్నారు.




మాగనూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మరికల్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని షీ టీమ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం మరికల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అలాగే పోటీ పరీక్షలు గురించి, న్యాయకత్వ లక్షణాలు, డయల్ 100 తదితర విషయాల గురించి వారికి వివరించారు. ఈ వయసులో చదువుపై దృష్టి పెట్టి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ పోలీసులు జ్యోతి, చెన్నప్ప, కవిత పాల్గొన్నారు.

గోరింటాకు సంబరం.. అతివల ఆనందం

నారాయణపేట రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోరింటాకు సంబరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సరిత బట్టడ్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో హాజరై చేతులకు మెహిందీ పెట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని, రక్త ప్రసరణ చక్కగా జరుగుతుందన్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు క్లబ్ సభ్యులను అభినందించారు.



గోరింటాకు చూపిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మహిళలు

శివాజీ విగ్రహ ఏర్పాటులో వివాదం



ధన్వాడ: మండల కేంద్రంలోని స్థానిక సంత బజార్ వద్ద ఏర్పాటు చేస్తున్న శివాజీ విగ్రహ ఏర్పాటు పనుల్లో ఎస్ఐ రాజశేఖర్ బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టకూడదని కలెక్టర్ ద్వారా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ సూచించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గతంలో ఇక్కడ గాంధీ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నామని ఇంకొ వర్గం చెప్పడంతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసుకొని గాంధీ విగ్రహంతో పాటు శివాజీ విగ్రహాన్ని ఏర్పాటుకు అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

నారాయణపేట రూరల్: మండలంలోని భైరంకొండ, జలాల్ పూర్, ఎక్లాస్ పూర్ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు సాయిబన్న కోరారు. ఈ మేరకు స్థానిక ఎలక్ట్రిసిటీ ఎస్ఈ, డీఈలకు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, రైతులతో కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. ఆరు నెలలుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని, నిరంతర కరెంట్ సరఫరాకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శివప్ప, ప్రహ్లాద్, భీమేష్, చంద్రప్ప, కిష్టప్ప, ఆనంద్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

మద్దూరు: మండలంలోని రెనివట్ల పల్లె దవాఖానాలో వైద్య సిబ్బందిని నియమించి మెరుగైన వైద్యసేవలు అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు, డీఎంఅండ్‌హెచ్ఓ జయచంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. మద్దూరు సీహెచ్‌సీ సెంటర్‌లో వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే సీహెచ్‌సీ స్థలం ఆక్రమణకు గురవుతుందని సర్వే చేయించి, ప్రహరీ నిర్మించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో 2024–25 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై రెండు రోజులుగా కొనసాగుతున్న సామాజికి తనిఖీ బుధవారం ముగిసింది. మొత్తం రూ.6.32 కోట్ల పనులకు గాను రూ.5.50 కోట్లకు ఈ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో నాగిరెడ్డిపల్లిలో రూ.38,647 పోర్లకుంట తండాలో రూ.32,873 కొమ్మురులో రూ.22,855 మద్దూరులో రూ.17,470 నాగంపల్లిలో రూ.10,979 రికవరీకి ఆదేశాలు జారి చేశారు. కార్యక్రమంలో ఉపాధి విజిలెన్స్ అధికారి రామకృష్ణరెడ్డి, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

నర్వ: మండల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని ట్రెయినీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం నర్వ పీహెచ్‌సీని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రికార్డులను పరిశీలించి, ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఒకరిపై ఒకరు పనితీరు గురించి ఫిర్యాదు చేసుకోగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి వైద్యుడు వెంకటరమణపై కొన్ని రోజులుగా స్టాఫ్‌నర్సులు కవిత, గౌరి, తులసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమయపాలనపై ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో డీఎంహెచ్ఓ ఆగ్రహం వ్యక్తం చేసి, ఇలాంటి చర్యలకు పాల్పడితే అందరిని బదిలీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యుడు డా.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ ఆగమాగం

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ ఆగమాగం మైందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌లో ఎస్ఎఫ్ఐతో పాటు ఇతర వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను మూసివేయించి తమ నిరసన వ్యక్తం చేశారు.

- నారాయణపేట పరిధిలో అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ముందస్తుగా సెలవు ప్రకటించగా, ప్రభుత్వ విద్యాసంస్థల్లో సంఘాల నాయకులు వెళ్లి తరగతులు బహిష్కరించారు. పీడీఎస్‌యూ నాయకులు సాయి కుమార్, నరహరి మాట్లాడుతూ ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిష్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.
- మాగనూర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. విద్యాశాఖ మంత్రిని నియమించి గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.
- కోస్గిలో నిర్వహించిన బంద్‌లో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ పాల్గొని మాట్లాడుతూ కార్పోరేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని అలాగే ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.



ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతులు బహిష్కరించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

- ధన్వాడలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలు పాఠశాలలను మూసివేయించాయి. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
- నర్వలో తలపెట్టిన బంద్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేందర్ పాల్గొని రూ.8 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని కోరారు.
- దామరగిద్దలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు మోహన్, వెంకటేశ్‌లు మాట్లాడుతూ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులకు ఫ్రీ బస్ పాస్‌లను ఇవ్వాలన్నారు.
- మక్తల్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలను మూసివేయించారు. ఖాళీగా ఉన్న ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేసి, రాష్ట్రంలో జాతీయ నూతన విద్యావిధానం అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు.

‘అభివృద్ధి కాగితాలకే పరిమితం’

నర్వ: ప్రజామోదంతో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం దారుణమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్వలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యేను మెకానిక్ అని సంబోధించడం ఎంత వరకు సమంజసమన్నారు. చిట్టెం కుటుంబం ప్రోత్సాహంతోనే ప్రస్తుత మంత్రి.. సర్పంచ్ నుంచి జడ్పీఫ్లోర్ లీడర్ వరకు వివిధ పదవులు అనుభవించాడన్నారు. నాడు నియోజకవర్గంలో చిట్టెం చేసిన అభివృద్ధి నచ్చి ప్రజలు ఆయనను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్న అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని గత 18 నెలలుగా ప్రొసీడింగ్స్ చూపుతున్నారు తప్ప పని ఎక్కడా అని విమర్శించారు. జూనియర్ కళాశాల, క్రీడామైదానం, గురుకుల పాఠశాల, జక్కన్నపల్లి, రాంపూర్ బీటీ రోడ్డు పనులు ఇప్పుడు.. అప్పుడు అంటూ చెబుతున్నారు తప్ప పనుల ప్రారంభించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డుల పంపిణీ, రుణమాఫీలు ప్రచారంలో మాత్రం కొండంతా.. వాస్తవంలో పిసరంతా అన్న చందంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు దండు అయ్యప్ప, సుధీర్, జనార్ధన్, విజయ్‌కుమార్, లక్ష్మీనర్సింహా, రఫీ, రాములు, అజయ్, కృష్ణ, బొజ్జన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

ఎరువులు, యూరియా కొరత లేకుండా చూడాలి



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా, ఎరువులను డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో జయసుధకు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్షులు భగవంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి మాట్లాడుతూ చాలా చోట్ల సహకార సంఘాల కేంద్రాల వద్ద రైతులు పాసుబుక్కులు పట్టుకొని లైన్లలో నిలబడిన క్యూ కనిపిస్తోందని, ఒక్కో రైతుకు ఒకటి రెండు బస్తాలు మాత్రమే యూరియా దొరుకుతున్న పరిస్థితి నెలకొందన్నారు. దళారులు, వ్యాపారస్తులు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, నరసింహులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా విద్యాలయాల్లో అలాగే కోస్గి, మద్దూరులోని మహిళా డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ధన్వాడ, మాగనూర్, కోస్గి, మద్దూరు, మక్తల్‌లోని కస్తూర్బా విద్యాలయాల్లో తెలుగు, బోటనీ, హిందీతో ఇతర సబ్జెక్టులను బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏంఎ,ఎమ్మెస్సీ, బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఆయా కళాశాలలో అందజేయాలన్నారు.

హాస్టళ్ల దుస్థితిపై బీజేపీ నాయకుల ఆగ్రహం

ధన్వాడ: అధికారులు, అధికార పార్టీ నాయకులు తమ పిల్లాలను ప్రభుత్వ హాస్టళ్లలో ఉంచగలరా అని కిసాన్ మోర్చా రాష్ట్రా కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య ప్రశ్నించారు. బుధవారం స్థానిక మోడల్ పాఠశాల వసతి గృహాలను వారు సందర్శించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు అధ్వానంగా తయారవడంతో విద్యార్థులు నాలుగు రోజులుగా విద్యార్థులు స్నానం కూడ చేయకుండా ఉండడాన్ని తెలుసుకున్న నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టించుకోని అధికారులను సస్పెండ్ చేసి వేంటనే శాశ్వత పరిష్కరం చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయేతర పనులకు ఉపయోగించొద్దు

కృష్ణా: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న యూరియాను ఇతర వాటికి ఉపయోగిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ నవీద్ సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారు మండంలోని టైరోడ్డులో పెట్రోల్, డీఈఎఫ్ (డిజిల్ ఎక్స్‌హాస్టేడ్ ఫ్యూల్) పరిశ్రమలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి కాకుండా ఇతర వాటికి యూరియా వాడుతున్నారనే అనుమానంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

పెట్రోల్ బంకు పరిసరాల్లో తనిఖీ

కోస్గి రూరల్: మండల పరిధిలోని పెట్రోల్ బంకు పరిసరాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి రామకృష్ణ బుధవారం తనిఖీలు చేపట్టారు. యూరియా అందక రైతులు అవస్థలు పడుతున్నట్లు తెలియడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టి దుకాణాదారులను హెచ్చరించినట్లు తెలిపారు.

టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి

దామరగిద్ద: మండల కేంద్రంలోని వివిధ ఫర్టిలైజర్ దుకాణాల్లో అలాగే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో తహసీల్దార్ తిరుపతయ్య, వ్యవసాయ అధికారి మణిచందర్, ఎస్ఐ రాజుల సంయుక్తంగా ఆకస్మి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా యూరియ డీఏపీ, కాంప్లెక్ ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. ఎరువుల సరఫరాలో ఏమైనా సమస్యలుంటే రాష్ట్ర టోల్ ఫ్రీ నంబర్‌కు 89777 41771 ఫిర్యాదు చేయాలన్నారు.